వర్షం.. స్తంభించిన జనజీవనం



టీపీగూడూరు: భారీ వర్షంతో కాలనీలోని రహదారిపై నీరు



కోడూరు తీరంలో అలల ఉధృతి

- మండలాల్లో ఒకటే వాన
- ఆందోళనలో లోతట్టు ప్రాంత వాసులు
- వేట నిలిపివేసిన మత్స్యకారులు

తోటపల్లిగూడూరు: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం ఆరు గంటల నుంచి మొదలైన వాన సాయంత్రం వరకు ముంచెత్తింది. ఎడతెరపి లేని వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది. అలాగే ఈదురు గాలులు, చలితీవ్రత కారణంగా కోడూరు, వెంకన్నపాళెం తీరప్రాంత గ్రామాల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పగలే చీకట్లు కమ్ముకోవడం.. పొగమంచు కారణంగా వాహనదారులు రాకపోకల సమయంలో అవస్థలు పడుతున్నారు. ముసురు కారణంగా జనం ఇళ్లు వదిలి బయటకు రాలేకపోయారు. కోడూరు సాగరతీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతుండడంతో మత్స్యకారులు వేటను నిలిపివేసి వలలు, బోట్లను తీరంలో భద్రపరుచుకున్నారు. కాగా భారీ వర్షం కారణంగా పలు లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. తుఫాన్ ముప్పు ఉందనే ప్రచారంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అటు మంచు.. ఇటు ముసురు

ముత్తుకూరు: మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి వర్షం మొదలైంది. ఓ వైపు దట్టంగా కురిసిన మంచు.. మరోవైపు ముసురు పట్టడంతో పట్టపగలే చీకట్లు అలుముకున్నాయి. చలితీవ్రత పెరిగింది. దీంతో జనం లేక బజారు వీధులు వెలవెలబోయాయి. సముద్రంలో అలలు ఎగసిపడడంతో మత్స్యకారులు పూర్తిగా చేపల వేట ఆపేశారు. పనులు లేకపోవడంతో వ్యవసాయ కార్మికులు ఇళ్లకే పరిమితమయ్యారు. 10.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

చెరువుల్లోకి వర్షపునీరు

పొదలకూరు: మండలంలోని చెరువుల్లోకి వర్షపు నీరు చేరుతోంది. వరద కాలువలు బాగున్న చెరువుల్లో 50 శాతానికి పైగా నీరు చేరినట్టు జలవనరుల శాఖ ఏఈ అనిల్ కుమార్ వెల్లడించారు. మండలంలో మొత్తం 52 చెరువులున్నాయి. గతంలో కురిసిన వర్షానికి కల్యాణపురం పాట్లేళ్లవాగు చెరువు ఒక్కటే నిండింది. మిగిలిన చెరువుల్లోకి 20 శాతం నీరు చేరింది. ఈనెలలో తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి 50 శాతానికి నీటి నిల్వలు చేరుకున్నాయి. రైతులు నార్లు పోసుకున్నారు. కొందరు నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. భారీ వర్ష సూచన ఉందని కొందరు నార్లు పోసుకునే పనిని వాయిదా వేసుకున్నారు. మరికొందరు మాత్రం ముందుగానే నార్లు పోసుకోవడంతో నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలో కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. చలిగాలులతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడ్డారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్

మనుబోలు: భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సుబ్బయ్య అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అధికారులు చెరువు కట్టలు, కాలువల వెంబడి పర్యటించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాల తీవ్రత ఎక్కువైతే తీర ప్రాంత ప్రజలను తరలించేందుకు తుపాన్ షెల్టర్‌ను సిద్ధంగా ఉంచుతామన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న చోట్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.



తోటపల్లిగూడూరులో మారిన వాతావరణం



నావూరుపల్లి చెరువులో నీరు

క్లుప్తంగా

అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ

మనుబోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ఎంపీడీఓ జలజాక్షి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సొంతిల్లు లేని వారి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎంఏవై 2.0 పథకాన్ని తీసుకొచ్చాయని తెలిపారు. అర్హులైన వారు సంబంధిత పత్రాలను సచివాలయాల్లో అందజేసి ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ భాస్కర్‌రావు, ఏఓ ముజిబున్నీసా పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



రమణయ్య

కోవూరు: వీఎస్‌యూ, కావలి క్యాంపస్‌కు చెందిన పరిశోధకుడు రాగాల రమణయ్యకు డాక్టరేట్‌ను వర్సిటీ ప్రదానం చేసింది. డెవలప్‌మెంట్ ఆఫ్ మేనేజీరియల్ పర్సనల్ ఇన్ సెలెక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండస్ట్రీస్ ఆఫ్ ఎస్పీఎస్సార్ నెల్లూరు డిస్ట్రిక్ట్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ క్రమంలో డాక్టరేట్‌ను వీఎస్‌యూ అందజేసింది.

బ్యాంక్ ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్ల ఆవిష్కరణ

పొదలకూరు: బ్యాంక్ ఖాతాదారులు అపరిచిత ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని, లేదంటే ఖాతాలో ఉన్న సొమ్ము మాయవుతుందని ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ షేక్ అహ్మద్ పేర్కొన్నారు. మండలంలోని నేదురుమల్లి గ్రామ ఎస్సీ కాలనీలో ఆర్బీఐ సౌజన్యంతో బ్యాంక్ ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత – సైబర్ మోసాలపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అహ్మద్ మాట్లాడుతూ ఓటీపీ, డెబిట్‌కార్డుల పిన్, సీవీవీ నంబర్లు ఇతరులకు వెల్లడించవద్దని పేర్కొన్నారు. ఇలాంటి వివరాలను బ్యాంక్‌లు అడగవని గుర్తుపెట్టుకోవాల్సిందిగా సూచించారు. ఈ సదస్సులో బ్యాంకు ఖాతాదారులు, కె.రవీంద్రబాబు, సంస్థ కో–ఆర్డినేటర్లు వెంకటేశ్వర్లు, ఎ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీసీఐతో అనుసంధానించుకోవాలి

కోవూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను పొందేందుకు గానూ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా ఖాతాలను తెరిచి వాటిని ఎన్పీసీఐతో అనుసంధానం చేసే ప్రక్రియను చేపట్టామని పోస్ట్‌మాస్టర్ ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాలను ఆధార్ బయోమెట్రిక్ ద్వారా ఓపెన్ చేయనున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మత్స్యకారులు వేటకెళ్లరాదు

విడవలూరు: తీర ప్రాంతాల్లోని మత్స్యకారులు వేటకెళ్లరాదని తహసీల్దార్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు తీర ప్రాంతాలైన రామలింగాపురం, వెంకటనారాయణపురం, లక్ష్మీపురం, ఆంజనేయపురం, ఊటుకూరు పెద్దపాళెం గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. వాయుగుండం ప్రభావంతో మత్స్యకార గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

బాల్య వివాహాలు నేరం



టీపీగూడూరు: మాట్లాడుతున్న ఏసీడీపీఓ రాజ్యలక్ష్మి

తోటపల్లిగూడూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఇందుకూరుపేట ప్రాజెక్ట్ ఐసీడీఎస్ ఏసీడీపీఓ రాజ్యలక్ష్మి అన్నారు. వరిగొండ – 1 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా బాల్య వివాహాలను చేస్తే తల్లిదండ్రులు, పెళ్లి పెద్దలు శిక్షార్హులన్నారు. కార్యక్రమంలో వరిగొండ పీహెచ్‌సీ సీహెచ్ఓ కృష్ణారెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రంగమ్మ, గ్రామ ఉపసర్పంచ్ హరికృష్ణారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు వాత్సల్యమ్మ, పుష్పలత, సునీత, భవానీ, షానవాజ్, భార్గవి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: బాల్య వివాహాలతో సంభవించే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని కొరుటూరు ఎస్టీ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ రాజ్యలక్ష్మి మాట్లాడారు. బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సూపర్‌వైజర్లు అరుణకుమారి, మంజుల, ప్రధానోపాధ్యాయుడు హరి, పద్మిని పాల్గొన్నారు.

హక్కులు, చట్టాలపై అవగాహన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: హక్కులు, చట్టాలపై మండలంలోని రామచంద్రాపురం గురుకుల పాఠశాలలో బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. బేటీ బచావో.. బేటీ పడావో, గుడ్.. బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోషల్ కౌన్సెలర్ కమల మాట్లాడారు. ఏమైనా సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 181, 112కు సమాచారం అందించాలని కోరారు. ప్రిన్సిపల్ గీత, సిబ్బంది సుజాత, జ్యోతి, ప్రశాంతి, సాధన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఇందుకూరుపేట: ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆ దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని జగదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు కిశోర్‌కుమార్, బ్రహ్మేశ్వరనాయుడు పేర్కొన్నారు. మండలంలోని ఆదెమ్మసత్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం వారికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్ వీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు జరిగాయి.

ఎగసిపడుతున్న అలలు

ఇందుకూరుపేట: వాయుగుండం ప్రభావంతో బంగాళాఖాతంలో అలలు ఎగసిపడుతున్నాయి. తీరం వెంబడి చలిగాలులు వీస్తున్నాయి. ప్రతికూల వాతావరణం కారణంగా మైపాడు బీచ్‌కు పర్యాటకుల రాక తగ్గముఖం పట్టింది. ఎడతెరపిలేని వర్షంతో జనజీవనం స్తంభించింది. రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. వ్యవసాయ పనులకు అంతరాయం ఏర్పడింది.

నేనున్నా.. కాపాడుకుంటా..



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు చిన్నయ్య. రాపూరుకు చెందిన ఇతను తన భార్యను వీపుపై మోస్తూ పొదలకూరులో బిక్షాటన చేస్తూ కనిపించాడు. గిరిజన కుటుంబానికి చెందిన చిన్నయ్య భార్య కోటమ్మ నడవలేని స్థితిలో ఉంది. కూలీనాలీ చేసుకోవాలంటే పక్షవాతానికి గురైన భార్యను ఇంటి వద్ద ఒక్కటే వదల్లేక ఇలా చేస్తున్నట్టు వెల్లడించాడు. భార్య ఆరోగ్యం దెబ్బతిని మంచాన పడితే పట్టించుకోని భర్తలు చాలామందే ఉన్నారు. అయితే చిన్నయ్య అలా చేయకుండా భార్యను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు.

– పొదలకూరు

టీచర్‌కు సన్మానం



పొదలకూరు: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా మండలంలోని మొగళ్లూరు జెడ్పీ హైస్కూల్ సాంఘిక శాస్త్ర టీచర్ కె.నాగరాజును ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ ఫోరం ఎంపిక చేసి రెండు రోజుల క్రితం విజయనగరంలో పురస్కారం అందజేసింది. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సహచర ఉపాధ్యాయులు ఆయన్ను స్కూల్లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే స్వేచ్ఛగా జీవిస్తున్నాం



బుచ్చిరెడ్డిపాళెం: ఎంపీడీఓ కార్యాలయంలో..



విడవలూరులో..



కొడవలూరు: గురుకుల పాఠశాలలో..

కొడవలూరు: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

⇨ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగంతోనే ప్రజలంతా స్వేచ్ఛగా జీవిస్తున్నారని ఎంపీడీఓ సుబ్బారావు పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఎంఈఓ వసంతకుమారి, ఈఓపీఆర్డీ సాయిప్రసాద్, హౌసింగ్ ఏఈ ముక్తార్‌బాషా, ఏఓ లక్ష్మి, ఏపీఎం కృష్ణవేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిర్మల, నాగభూషణమ్మ, పద్మావతి, సూపరింటెండెంట్ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

⇨ కొడవలూరులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ దేవసహాయం, గ్రంథాలయాధికారి రాజేశ్వరి, విశ్రాంత ఉపాధ్యాయుడు మోహన్‌రావు పాల్గొన్నారు.

⇨ యల్లాయపాళెంలోని గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: కోవూరులోని గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. న్యాయవాది కాకు మురళీరెడ్డి, ప్రిన్సిపల్ సందీపకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు: స్థానిక పీఆర్ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ సుజాత, రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు ప్రియాంతి తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీలో..

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీడీఓ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

⇨ రామచంద్రాపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అంబేడ్కర్ సేవా పురస్కార గ్రహీత గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు నిర్మల, మున్వర్ అహ్మద్, వేణు, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో..

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో మంగళవారం భారత రాజ్యంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వర్సిటీ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వద్ద రాజ్యాంగం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో..

తోటపల్లిగూడూరు: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలో కార్యక్రమాలు జరిగాయి. సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో టీచర్లు, విద్యార్థులు మొదటి బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం షేక్ అహ్మద్‌బాషా మాట్లాడారు. రాజ్యాంగంపై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్‌పర్సన్ గిరిజాకుమారి, టీచర్లు వసంతలక్ష్మి, హెప్సీవిద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా..

పొదలకూరు: పట్టణంలోని అమరావతి స్కూల్లో మంగళవారం ఘనంగా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ కె.సురేష్ మాట్లాడారు. నాగార్జున స్కూల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్యాంగ పీఠికను విద్యార్థుల వద్ద చదివించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సునీతారెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీదుర్గా, స్కూల్ యాజమాన్యం సుబ్బారావు, చంద్రశేఖర్, కృష్ణ, పాపయ్య, జీఎస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

మనుబోలు: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జలజాక్షి, ఎంపీపీ గుండాల వజ్రమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలన్నారు. ఏపీఓ రాజమ్మ, ఏఓ ముజిబున్నీసా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మనుబోలు అంబేడ్కర్ నగర్‌లో దళిత నాయకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.



కొడవలూరు: బహుమతులను అందజేస్తున్న సుబ్బారావు



కోవూరు: గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో..



పొదలకూరు: అమరావతి పాఠశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు



టీపీగూడూరు: సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో..



కొడవలూరు: యల్లాయపాళెంలోని గ్రంథాలయంలో..



పొదలకూరు: నాగార్జున స్కూల్లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు



మనుబోలు: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



బుచ్చిరెడ్డిపాళెం: రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో..